క్లుప్తంగా

సమన్వయంతో పనిచేయాలి



అలంపూర్: మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ మంజుల అన్నారు. అలంపూర్ తహసీల్దార్ మంజుల మంగళవారం ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న కమిషనర్ సరస్వతి బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీపై వెళ్లారు. ఆమె స్థానంలో స్థానిక తహసీల్దార్ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అందరూ సమయపాలన పాటించి, ఎప్పటి సమస్యలు అప్పుడే పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

క్యూబాపై అమెరికా నిర్బంధాన్ని ఖండిద్దాం



గద్వాల అర్బన్: క్యూబా దేశంపై అమెరికన్ సామ్రాజ్యవాద నిరంకుశ, అణిచివేత విధానాలను కార్మికవర్గం ఖండించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి అన్నారు. క్యూబా ప్రజలకు సంఘీభావంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని పాత బస్టాండులో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ శాంతి కోసం జరిగే పోరాటాలు ఉద్యమాల్లో కార్మిక వర్గం ముందుండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేరు నర్సింహ, వీఓఏ సంఘం నాయకులు వెంకట్రామయ్య, నరేష్, బాబన్న, వీరేష్, బాషా తదితరులు ఉన్నారు.

ఆలయాలను పునరుద్ధరించాలి



మానవపాడు: మండలంలోని చిన్నపోతులపాడులో మారెమ్మ, కర్రెమ్మ ఆలయాలను పునరుద్ధరించాలని విశ్వహిందూ పరిషత్ మండల కమిటీ అధ్యక్షుడు జగ్గల రాజు, సుబ్బరాజు మంగళవారం కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న ప్రాచీన ఆలయాలను పునర్నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మన్న, చిన్నతిప్పన్న, రాజు, నాగమద్దిలేటి, శ్రీరాములు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు మురళీకృష్ణ, మదన్, కురుమన్న, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పంట సాగుపై అవగాహన

అలంపూర్ రూరల్: మండలంలోని బుక్కాపురం రైతువేదికలో మంగళవారం శాస్త్రవేత్తలు యాసంగి పంట సాగులో మెలుకువలు, సూచనలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యాసంగిలో మొక్కజొన్న, శెనగ, పెసర, మినుములు, వేరుశనగ, తదితర పంటలు సాగు చేసి యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించొచ్చన్నారు. కార్యక్రమంలో అలంపూర్ డివిజన్ సహాయ సంచాలకులు సక్రియానాయక్, రైతులు మహేశ్వరరెడ్డి, లక్ష్మన్న, వెంకట్రాములు, జయరాంరెడ్డి, ఏఓ నాగర్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

గద్వాల అర్బన్: మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం టీయూసీఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా టీయూసీఐ రాష్ట్ర నాయకుడు హనుమంతు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు కార్మికులకు రూ. 10వేల వేతనం ఇవ్వాలన్నారు. కార్మికులకు పని భద్రత కల్పించడంతో పాటు పెండింగ్ బిల్లులను చెల్లించాలని, వంట పాత్రలు, గ్యాస్ సిలిండర్లు, కోడి గుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏఓకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా కార్యదర్శి కృష్ణ, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు పాల్గొన్నారు.



కూలీల కొరతతో అవస్థలు



చిన్న ఆముదాలపాడులోని పత్తి చేనులో కూలీలు

- ఇతర ప్రాంతాల నుంచి తీసుకొస్తున్న రైతులు
- పెరుగుతున్న అదనపు ఖర్చులు

ఉండవెల్లి: కొండంత ఆశతో పంటలు సాగు చేస్తున్న రైతులకు నిత్యం తిప్పలు తప్పడం లేదు. దుక్కి దున్ని, విత్తనాలు నాటి, అవి మొలచి పంట దశకు చేరే వరకు చేసిన శ్రమ ఒక ఎత్తయితే.. పంట చేతికి రావడం మరో ఎత్తుగా మారింది. స్థానికంగా కూలీలు అందుబాటులో లేకపోవడంతో పంట కోత దశలో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

ఆంధ్ర నుంచి కూలీలను తీసుకొచ్చి..

మండలంలో 16 గ్రామాల్లో దాదాపు 10 వేలకు మంది రైతులు ఉండగా.. అధిక శాతం మంది పత్తి పంట సాగు చేశారు. మండల వ్యాప్తంగా 8 వేల ఎకరాల సాగు భూమి ఉంటే సుమారు 6 వేల ఎకరాల్లో పత్తి సాగయిందని అధికారులు అంచనా చేశారు. అయితే ఆ పొలాలన్నీ ఒకేసారి దిగుబడి రావడంతో పత్తిని తీసేందుకు అవసరమైన కూలీలు స్థానికంగా దొరకడం లేదు. అంతే కాకుండా ఏటా గ్రామాల్లో కూలీల సంఖ్య భారీగా తగ్గుతోంది. దీంతో కర్నూల్ జిల్లాలోని పక్క మండలాలకు చెందిన కూలీలను తీసుకొచ్చి నివాసం ఏర్పాటు చేసి స్థానిక రైతులు పత్తి తీయించుకుంటున్నారు. దీంతో కూలీ డబ్బులతో పాటు వలస కూలీలకు వసతులు కల్పించేందుకు అదనంగా డబ్బు ఖర్చు చేయాల్సి వస్తోంది.



ఉండవెల్లిలో ఆటోలో ప్రయాణిస్తున్న కూలీలు (ఫైల్)

అదనపు భారం

మండలంలోని చిన్న, సన్నకారు రైతులు మానవపాడు, అలంపూర్, కర్నూల్‌లో ఉండే గ్రామాల నుంచి ప్రత్యేకంగా ఆటోల్లో రోజువారీగా కూలీలను తీసుకొచ్చి పత్తిని తీయిస్తున్నారు. అందుకు కూలీ డబ్బులతో పాటు ఆటో చార్జీలు అదనంగా భరించాల్సి వస్తుంది. దీంతో పెట్టుబడి, ఈ అదనపు ఖర్చులు పోను కనీసం తమ కష్టానికి కూలీ కూడా గిట్టుబాటు కావడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పత్తి కేజీకి రూ.13 కూలి

పత్తి బాగా దిగుబడి రావడం, అన్ని పొలాల్లో ఒకేసారి కాపు రావడంతో రైతులకు కూలీల అవసరం అధికం కావడంతో వారికి డిమాండ్ అమాంతం పెరిగింది. పత్తి తీయడానికి గతంలో కేజీకి రూ.12 ఇచ్చేవారు. కానీ ఈ ఏడాది కూలీల కొరత కారణంగా కేజీకి రూ.13 చెల్లించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. కానీ పత్తి క్వింటాకు రూ.7 వేలు చెల్లించే వ్యాపారులు దిగుబడి పెరగడంతో ప్రస్తుతం రూ.6వేల నుంచి రూ.6,500 మాత్రమే చెల్లిస్తున్నారు.

ఆంధ్ర నుంచి..



ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో పత్తి దిగుబడి పెరిగినా ధర మాత్రం కరువైంది. పత్తి ఏరేందుకు స్థానికంగా కూలీల కొరత ఉండడంతో ఆంధ్రా నుంచి తీసుకొచ్చి వారికి నివాసం ఏర్పాటు చేశాం. అంతేకాకుండా ఇతర వసతులు కల్పించడం భారంగా మారింది.

– వెంకటేష్, మారమునగాల–2, రైతు

కూలీలు దొరకక..



స్థానికంగా కూలీలు దొరకడం లేదు. దీంతో కూలీలు రేట్లు పెంచుతున్నారు. ఎవరు ఎక్కువ కూలి ఇస్తే వారి పొలంలో పనులు చేస్తున్నారు. దీంతో చిన్న, సన్నకారు రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. దీనితోడు దళారులు పత్తి ధర తగ్గిస్తున్నారు.

– అశోక్, చిన్న ఆముదాలపాడు, రైతు

బాలలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి

శాంతినగర్: బాలల సమస్యలపై ప్రతి ఒక్కరూ దృష్టిసారించాలని ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. మండలస్థాయి బాలల హక్కుల పరిరక్షణ వేదిక సమావేశాన్ని ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఐకేపీ భవనంలో మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పిల్లల సమస్యలను పరిష్కరించడంలో బాలల హక్కుల పరిరక్షణ సభ్యుల కృషి చాలా బాగుందన్నారు. సభ్యులేగాక ఆయా గ్రామాల్లోని పెద్దలు, యువకులు బాలల సమస్యలపై స్పందించి న్యాయం చేయాలన్నారు. తహసీల్దార్ ప్రభాకర్ మాట్లాడుతూ బాల్య వివాహాలపై గ్రామస్థాయిలో అవగాహన కల్పిస్తామని, ఎక్కడైనా బాల్య వివాహం చేస్తున్నారని తెలిస్తే తమ దృష్టికి తేవాలని కోరారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

సమావేశంలో ఎంవీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ హనిమిరెడ్డి, ఏపీఎం మార్తమ్మ, సీసీలు చిట్టెమ్మ, ఆర్‌ఐ ఆంజనేయులు, సీఆర్‌పీఎఫ్ మండల కమిటీ సభ్యులు శేఖర్, బుచ్చన్న, జైరాం పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

అయిజ: అధికారులు, సిబ్బంది ప్రజలతో మమేకమై కుల గణన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ జ్యోతి అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మున్సిపల్ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కుల గణనకు సంబంధించి కలెక్టర్ కార్యాలయం నుంచి వచ్చిన నమూనాలను పరిశీలించి అధికారులతో కలిసి ప్రణాళిక తయారు చేశారు. మొత్తం 20 వార్డుల్లో కుల గణన సర్వే పూర్తి చేయాలన్నారు. సర్వే చేసేందుకు ఎన్యుమరేటర్లను ఎంపిక చేశామని, వారికి త్వరలో శిక్షణ ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో



మాట్లాడుతున్న తహసీల్దార్ జ్యోతి

మున్సిపల్ మేనేజర్ అశోక్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ అశోక్, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, అంగన్‌వాడి టీచర్లు, ఆర్పీలు పాల్గొన్నారు.

‘బండ్ల రాజశేఖర్‌రెడ్డిని అరెస్టు చేయాలి’



ర్యాలీ చేస్తున్న నాయకులు

గద్వాల అర్బన్: మల్దకల్ మండలం బిజ్వారం గ్రామానికి చెందిన మైనర్ బాలికపై దొంగతనం కేసు మోపి బాలిక మృతికి కారకుడైన సీడ్ ఆర్గనైజర్ బండ్ల రాజశేఖర్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కార్యాలయం నుంచి క్రిష్ణవేణి చౌరస్తా వరకు ర్యాలీ చేపట్టి మృతి చెందిన బాలికకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా రంజిత్‌కుమార్ మాట్లాడుతూ ఎలాంటి దొంగతనం చేయకున్నా అక్రమంగా బాలికపై దొంగతనం కేసు మోపారని మండిపడ్డారు. బాలిక ఆత్మహత్యకు కారకుడైన బండ్ల రాజశేఖర్‌రెడ్డిని అదుపులోకి తీసుకోకుండా పోలీసులు ఈ కేసును నిరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరపాలన్నారు. మైనర్ బాలిక మృతిపై త్వరలో డీజీపీకి ఫిర్యాదు చేస్తామన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరగకపోతే నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు బుచ్చిబాబు, లవన్న, అవనిశ్రీ, శ్రీనివాస్‌యాదవ్, ఆంజనేయులు, విజయ్, గజేంద్ర, లక్ష్మన్న తదితరులు ఉన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు

అలంపూర్ రూరల్: మండలంలోని ర్యాలంపాడ్‌లో మంగళవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి శంకరయ్య మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి సోకిన పశువుల నోటిలో, గిట్టల మధ్యలో పుండ్లు కావటం, చొంగకారటం, మేత తినకపోడం, జ్వరం ఉండటం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఈ వ్యాధి సోకిన పశువును మంద నుంచి వేరు చేసి చికిత్స అందించాలని అన్నారు. శిబిరంలో 182 ఆవులు, ఎద్దులు, 196 గేదేలకు మొత్తం 378 పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలను వేసినట్లు పశు వైద్యాధికారులు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటనారాయణ, పశువైద్యాధికారి శంకరయ్య, జేవీవో శ్రీశైలం, వీఏలు యుగంధర్, శాంతి ఓఎస్ ప్రకాష్, గోపాలమిత్ర లాగూరానాయుడు, ప్రసాద్‌నాయుడు, పాడి రైతులు పాల్గొన్నారు.



మంగంపేటలో టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

మల్దకల్: గాలికుంటు వ్యాధితో పశువుల యజమానులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యాధికారి వినయ్‌కుమార్ సూచించారు. మంగళవారం మండలంలోని మంగంపేటలో 184 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు యామినిసాయి, ఉష, పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

మల్దకల్: ఫర్టిలైజర్ షాపు యజమానులు ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి రాజశేఖర్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఫర్టిలైజర్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫర్టిలైజర్ షాపు నిర్వాహకులు రైతులకు ఎరువులను విక్రయించిన వెంటనే రశీదులు ఇవ్వాలన్నారు. అంతకు ముందు ఆయన మల్దకల్‌లో పత్తి పంటను పరిశీలించారు.

ఫ్యాన్ల వితరణ

ఎర్రవల్లి: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో ఫ్యాన్లు లేకపోవడంతో చిన్నారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని టీచర్ మంగళవారం గ్రామస్తుల దృష్టికి తీసుకెళ్లింది. విషయం తెలుసుకున్న మాజీ ఉప సర్పంచ్ పద్మవెంకటన్న, గ్రామస్తులు వాట్ల భాస్కర్, మొద్దుల గోవర్ధన్ అంగన్‌వాడీ పాఠశాలకు అవసరమైన ఫ్యాన్లు వితరణ చేశారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

మల్దకల్: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే గర్భిణులు, బాలింతలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ నాగరాణి సూచించారు. మంగళవారం మల్దకల్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ నాగరాణి మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు. గర్భిణులు పోషకాలు ఎక్కువగా ఉండే పాలు, గుడ్లు, ఆకుకూరలను ఎక్కువగా తీసుకోవడంతో పాటు ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవాలు చేయించుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు అంగన్‌వాడీ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎత్తు, బరువు తక్కువగా ఉన్న చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు తెల్లమ్మ, బాలమ్మ, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీపీఓ నాగరాణి

రూ.10 నాణేలు చెల్లుతాయి

అయిజ: రూ.10 నాణేలు చెల్లుతాయని, ప్రజల నుంచి వ్యాపారులు నిరంభ్యంతరంగా వాటిని తీసుకోవాలని ఎస్‌బీఐ అయిజ బ్రాంచ్ మేనేజర్ వెంకటేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.10నాణేలు చట్టబద్ధమైనవని, రోజువారీ లావాదేవీలకు ఉపయోగించవచ్చన్నారు. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక జనరల్ మేనేజర్ ధారాసింగ్‌నాయక్ ఆదేశాల మేరకు రూ.పది నాణెలను లావాదేవీలకు ఉపయోగించాలనే ఆర్బీఐ ఉత్తర్వుల మేరకు విస్తృత అవగాహన కల్పించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

అదనపు కలెక్టర్‌కు వినతి

ధరూరు: మండలంలోని ర్యాలంపాడు పునరావాస కేంద్రం సమస్యలను వెంటనే పరిష్కరించాలని మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి కోరారు. మంగళవారం ఆయన జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణను వారు కలిసి సమస్యలను వివరించారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగమైన ర్యాలంపాడు రిజార్వాయర్ కింద సర్వం కోల్పోయిన బాధితులకు పునరావాసం కల్పించేందుకు కేటాయించిన ప్రాంతంలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ముంపు బాధితులు ఏళ్ల తరబడిగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు తిమ్మప్ప, పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

ఎంపీడీఓకు వినతి

ఉండవెల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ తిరుపతన్నకు బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మహేంద్ర ఆధ్వర్యంలో విశ్వకర్మ పథకం అమలు చేయాలని వినతిపత్రం అందజేశారు. మంగళవారం బీజేపీ నాయకులు విశ్వకర్మ పథకంపై ఎలాంటి స్పందన లేదని, దరఖాస్తు చేసుకొని 9 నెలలవుతున్నా అధికారులు శిక్షణ ఏర్పాటు చేయలేదన్నారు. కార్యక్రమంలో ఉపేందర్ రెడ్డి, దరఖాస్తుదారులు అబ్దుల్‌నబీ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

శాంతినగర్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. వడ్డేపల్లి పట్టణంలోని ప్రధాన రహదారిపై మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పెండింగ్‌లో ఉన్న రూ.7,500 కోట్లు వెంటనే విడుదల చేసి అటు కళాశాలల నిర్వహణకు, ఇటు విద్యార్థులు విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మురళి, రాము, సురేష్, జుబేర్, శివ, పవన్‌కళ్యాణ్, వినయ్, నరేష్, లోకేష్, అశోక్, శ్రీనాథ్, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

కూలీల ఆటో బోల్తా: ఆరుగురికి గాయాలు



బోల్తాపడ్డ కూలీల ఆటో

ఎర్రవల్లి: ప్రమాదవశాత్తు అదుపుతప్పి కూలీలతో వెళ్తున్న ఓ ఆటో బోల్తా పడటంతో ఆరుగురికి గాయాలైన ఘటన మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. వడ్డేపల్లి మండలంలోని తనగలకు చెందిన ఓ ఆటోలో అదే గ్రామానికి చెందిన 15మంది కూలీలు వ్యవసాయ పనుల నిమిత్తం ఇటిక్యాల మండలంలోని శనగపల్లికి వెళ్లారు. ఈ క్రమంలో సాయంత్రం కూలి పనులు ముగించుకొని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా శనగపల్లి శివారులో ముందుగా వస్తున్న ఓ వాహనాన్ని తప్పించబోయి ఆటో ఒక్కసారిగా అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆరుగురు కూలీలకు రక్త గాయాలు కాగా.. మిగిలిన వారు తేలికపాటి గాయాలతో బయటపడ్డారు. గమనించిన స్థానికులు క్షతగాత్రులను అంబులెన్స్‌లో కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు. డ్యూటీ డాక్టర్ వారిని పరిశీలించి ఎలాంటి ప్రాణాపాయం లేదని తెలిపారన్నారు. ఇదిలా ఉండగా ఇటీవలే బీటీ రోడ్డు వేసిన సదరు కాంట్రాక్టర్ రోడ్డుకు ఇరువైపులా మట్టిని సక్రమంగా వేయకపోవడంతోనే రోడ్డు పక్కన గుంతలు ఏర్పడి ప్రమాదం చోటుచేసుకున్నట్లు స్థానికులు వాపోయారు.

తల్లిదండ్రుల సహకారంతోనే విద్యార్థుల్లోప్రగతి

ధరూరు: మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రులతో మీటింగ్ నిర్వహించినట్లు హాస్టల్ వార్డెన్ నర్సింహులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రగతి నివేదికను విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేశారు. ముఖ్యంగా 10వ తరగతి విద్యార్థులకు ఈ నాలుగు నెలలు అత్యంత కీలకమైనవని, చిన్న చిన్న శుభకార్యాలకు, పొలం పనులకు వారిని పిలవకుండా చూడాలన్నారు. ఇన్నాళ్లు చదివిన చదువు ఒక ఎత్తైతే ఈ నాలుగు నెలలు అత్యంత కీలకమైనవన్నారు. క్రమంగా పాఠశాలకు హాజరు అయ్యే విధంగా చూడాలని కోరారు.

పంటల వివరాల నమోదు

అలంపూర్ రూరల్: రైతులు సాగుచేసిన పంటల వివరాలను పక్కాగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు ఏడీఏ సక్రియానాయక్ అన్నారు. మంగళవారం అలంపూర్ మండలంలోని లింగన్‌వాయి, కోనేరు, బుక్కాపురం గ్రామాల్లో పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాసంగిలో సాగుచేసిన పంటలను వ్యవసాయశాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి, వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు.